క్లుప్తంగా

ఆలయ భూములకు 17న వేలం

ఆలమూరు: గ్రామంలో వేంచేసి ఉన్న మూడు దేవాలయాలకు సంబంధించి భూములను మూడేళ్ల పాటు సాగు చేసేందుకు ఈ నెల 17న వేలం పాటలను నిర్వహించనున్నట్లు ఈఓ సత్యనారాయణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఉదయం పది గంటలకు శ్రీదేవి భూదేవి సమేత జనార్దనస్వామి ఆలయం, 11 గంటలకు పార్వతీ సమేత విక్రమ భట్టీశ్వరస్వామి ఆలయ భూములకు, మధ్యాహ్నం 12 గంటలకు చండీ భైరవస్వామి ఆలయ భూములకు వేలం పాట జరుగుతుందన్నారు. ఇందులో పాల్గొనే రైతులు ముందుగా రూ.ఐదు వేల ధరావత్తు చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు 91777 27320 ఫోన్ నంబరులో సంప్రదించాలని ఈఓ వివరించారు.

మలేరియా నిర్ధారణ పరీక్షలు



ఆదుర్రులో నమూనాలు సేకరిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లోని ఇటుక బట్టీల వద్దకు వైద్యారోగ్య సిబ్బంది వెళ్లి కార్మికులకు మలేరియా నిర్ధారణ పరీక్షలు చేశారు. ఇతర ప్రాంతాల నుంచి మండలానికి వచ్చిన కార్మికులకు వాతావరణంలో మార్పుల కారణంగా ముందస్తు జాగ్రత్త చర్యగా ఆరోగ్య సిబ్బంది రక్త నమూనాలను సేకరించారు. పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సాయికిశోర్, ఎస్.లక్ష్మీస్నేహ నేతృత్వంలో ఆరోగ్య, ఆశ సిబ్బంది వలస కార్మికులు నివసిస్తున్న పెదపళ్ల, పినపళ్ల, సంధిపూడి, ఆలమూరు, జొన్నాడ గ్రామాల్లోని ఇటుక బట్టీల వద్దకు వెళ్లి ఆరోగ్య సమస్యలను తెలుసుకుని వివరాలను నమోదు చేసుకున్నారు. సీహెచ్‌ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా అక్కుల, బి.సూర్యనారాయణ, సీహెచ్‌ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మామిడికుదురు: ఆదుర్రు గ్రామంలోని ఎస్టీ ఏరియాలో సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలు చేశారు. లూటుకుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారి రమ్య శైలజ ఆధ్వర్యంలో 26 మంది నుంచి శాంపిల్స్ సేకరించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ బళ్ల శ్రీనివాసరావు పరిశీలించారు. ఏఎన్ఎం నాగలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ ఏడిద కవీంద్ర పాల్గొన్నారు.

దివ్యాంగుల కార్పొరేషన్ పదవుల నియామకంలో ప్రభుత్వం తాత్సారం

అమలాపురం టౌన్: రాష్ట్రంలో వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లు, డైరెక్టర్లను నియమిస్తున్నా దివ్యాంగుల కార్పొరేషన్‌కు చైర్మన్, డైరెక్టర్ల పదవులను నియమించడంలో కూటమి ప్రభుత్వం తాత్సారం చేస్తుందని అమలాపురానికి చెందిన ఏపీ దివ్యాంగుల మహా సంఘటన్ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి నిమ్మకాయల సురేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు రాష్ట్ర కార్పొరేషన్లకు పదవుల భర్తీ జరుగుతున్న క్రమంలో దివ్యాంగుల కార్పొరేషన్‌కు కూడా పదవుల భర్తీ తక్షణమే చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. దివ్యాంగుల కార్పొరేషన్ పదవుల భర్తీ విషయంలో సీఎం చంద్రబాబు చొరవ చూపాలని కోరారు. ఉభయ గోదావరి జిల్లాల్లోని దివ్యాంగులకు రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ ప్రత్యేక స్థానం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

ష్‌... మాకు తెలీదు!

- పథకాలపై భవన నిర్మాణ కార్మికులకు అవగాహన శూన్యం
- అధికారులు పట్టించుకోక ఇబ్బందులు
- సభ్యత్వ నమోదులో వెనుకబాటు



అంబాజీపేటలో భవన నిర్మాణ పనులు చేస్తున్న కార్మికుడు

అంబాజీపేట: ఎండనకా... వాననకా... శ్రమటోడ్చి పనిచేస్తున్న భవన నిర్మాణ కార్మికులపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది.. వీరికి ఆసరా కోసం పథకాలు ఉన్నా వాటిపై అవగాహన కల్పించడంలో వెనుకబాటునే ఉంటోంది.. ఆపద సమయంలో అండ లేక అనేక మంది కార్మిక కుటుంబాలు నిట్టూర్పు వదలాల్సిన పరిస్థితి వస్తోంది. భవన నిర్మాణ కార్మికుల భద్రత, సంక్షేమం కోసం 1998లో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకం ప్రారంభంలో కేవలం భవన నిర్మాణ కార్మికులకు మాత్రమే ఉపయోగపడేది. అనంతరం అనేక రకాల పనులు చేసే కార్మికులు ఈ పథకంలో చేరడానికి అర్హులుగా ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం భవన నిర్మాణ కార్మికులతోపాటు గ్రానైట్ కార్మికులు, ఉపాధి కూలీలు, టైలర్లు, ఎలక్ట్రీషియన్లు, కార్పెంటర్లు, మెకానిక్ పనులు చేసే కార్మికులు సభ్యత్వం తీసుకునేందుకు అర్హులుగా చేర్చింది. కానీ పి.గన్నవరం, రాజోలు, కొత్తపేట నియోజకవర్గాల్లోని 11 మండలాలకు సంబంధించి సుమారు 15 వేల మంది భవన నిర్మాణ కార్మికులకు ఈ సంక్షేమ పథకంపై అవగాహన కల్పించడంలో అధికారులు విఫమవుతున్నారు. కార్పెంటర్లు, టైలర్లు, ఉపాధి కూలీలు, ప్రమాద అంచుల్లో పనిచేస్తున్న భవన నిర్మాణ కార్మికులు, ఎలక్ట్రీషియన్లుగా అత్యధిక సంఖ్యలో ఉన్నా ఈ పథకంలో నమోదు మాత్రం శూన్యమనే చెప్పాలి. మొత్తం ఇప్పటికి 5,173 మంది మాత్రమే నమోదు చేసుకున్నారు. వీరికి అధికారులు అవగాహన కల్పించి సభ్యత్వం కల్పించాల్సిన బాధ్యత ఉన్నా ఎక్కడా అమలు కావడం లేదు. ఈ పథకం గురించి కార్మికులను అడిగితే అది మాకు తెలియదని చెప్పడం విశేషం. అర్హులైన కార్మికులు ప్రమాదాల బారిన పడి ఆ కుటుంబాలు రోడ్డున పడుతున్నా ప్రభుత్వ సాయం పొందలేకపోతున్నారు.

సభ్యత్వ నమోదు ఇలా..

చేతి వృత్తుల కార్మికులు 18 నుంచి 60 ఏళ్ల మధ్య ఉండాలి. ఈ పథకంలో దరఖాస్తుకు కార్మికుడి రెండు ఫొటోలు, ఆధార్, రేషన్ కార్డు, బ్యాంకు అకౌంట్ పాస్ పుస్తకం జిరాక్స్ కాపీలతో పాటు కార్మికుడిపై ఆధారపడి జీవించే వారి ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు అందజేయాలి. రూ.120 చెల్లించి కార్మిక శాఖ కార్యాలయంలో సభ్యత్వం పొందవచ్చు. ఒక్కసారి సభ్యత్వం తీసుకున్న వారి లేబర్ కార్డు పరిమితి ఐదేళ్ల వరకూ ఉంటుంది. ఆ తరువాత సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకోవాలి.

అనేక ప్రయోజనాలు

కార్మికుడు పనిచేసే చోట ప్రమాదవశాత్తు మరణించినా, శాశ్వత అంగవైకల్యం పొందినా రూ.2 లక్షల ఆర్థిక సాయం వర్తిస్తుంది. 50 శాతం అంగ వైకల్యం పొందిన వారికి రూ.లక్ష, సాధారణ మరణం పొందితే రూ.30 వేలు అందిస్తారు. వివాహం తర్వాత కార్మికునికి ఒక్కో కుమార్తెకు కాన్పు సమయంలో రూ.25 వేల చొప్పున రెండు కాన్పులకు ఆర్థిక సహాయం అందుతుంది. స్వల్ప మొత్తం చెల్లించి సభ్యత్వం పొందడం ద్వారా ఐదేళ్ల పాటు కార్మికుడికి, ఆయన కుటుంబానికి భద్రత లభించడంతో పాటు సంక్షేమ పథకాలను కూడా పొందే సౌలభ్యం ఉంటుంది.

అవగాహన కల్పించాలి



భవన నిర్మాణ కార్మికులకు ఎలాంటి పథకాలు వర్తిస్తాయనేది తప్పని సరిగా అధికారులు అవగాహన కల్పించాలి. కార్మికులుగా పని చేసేవారు చదువుకోకపోవడంతో వారికి జరిగే నష్టం గురించి తెలియదు. కార్మిక సంఘం ఆధ్వర్యంలో అవగాహన కల్పించడంతో పాటు అధికారులతో కలసి వారికి రావాల్సిన సంక్షేమ పథకాలను అందించే విధంగా చర్యలు తీసుకోవాలి.

–పితాని శ్రీనివాస్, ఎలక్ట్రీషియన్, నందంపూడి

పథకాల గురించి వివరించాలి



నియోజకవర్గంలో వేలాది మంది కార్మికులు పని చేస్తున్నారు. పనులు చేసే సమయంలో ఎక్కడో ఒక చోట ప్రమాదాల బారిన పడుతున్నారు. కొంత మంది శరీరంలోని కొన్ని అవయవాలను కోల్పోతున్నారు. మరికొంత మంది చనిపోతున్నారు. అటువంటి వారికి కార్మిక శాఖ నుంచి ఎటువంటి సహాయ, సహకారాలు అందుతున్నాయన్న విషయం చాలా మందికి తెలియదు. ఆ పథకాల గురించి వివరించాలి.

–పెచ్చెట్టి ప్రసాద్, తాపీమేస్త్రి, నందంపూడి

జగన్‌ను కలసిన కేఎస్ఎన్



వైఎస్ జగన్‌ను శాలువాతో సత్కరించిన రాజు

మలికిపురం: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మలికిపురానికి చెందిన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సీనియర్ నేత కేఎస్ఎన్ రాజు మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో జగన్‌ను శాలువాతో కేఎస్ఎన్ సత్కరించారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులు, బలోపేతంపై జగన్ చర్చించారని రాజు అన్నారు. దీనికి గాను తగిన సూచనలు ఇచ్చారని వివరించారు.

ఉపాధ్యాయ సంఘ మాజీ నేత మృతి



వెంకట్రాజు (ఫైల్)

ఆలమూరు: పెదపళ్లకు చెందిన ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ నేత, ఉమ్మడి జిల్లా పూర్వపు అధ్యక్షుడు యేలేటి వెంకట్రాజు (64) మృతి చెందారు. గత ఏడాది నవంబర్‌లో ఉద్యోగ విరమణ పొందిన ఆయన ప్రస్తుతం ధవళేశ్వరంలో నివాసం ఉంటున్నారు. బుధవారం రాత్రి ఆయన నివాసంలోనే మృతి చెందారు. ఆయన మృతికి పెదపళ్లకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, దళిత నేతలు సంతాపం తెలిపారు.

సాధారణ కాన్పులకు చర్యలు



రాజోలు బాలికల వసతి గృహంలో దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్న డీఎంహెచ్‌ఓ దొర

రాజోలు: గర్భిణులకు శస్త్ర చికిత్సలు తగ్గించి సాధారణ కాన్పులు చేసేందుకు జిల్లా స్థాయిలో కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఎం.దుర్గారావు దొర తెలిపారు. గురువారం ఆయన మండలంలోని ప్రభుత్వ వసతి గృహాలను సందర్శించారు. వసతి గృహాల్లో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై స్థానిక వైద్య సిబ్బందితో సమీక్షించారు. వసతి గృహాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. కిటికీలకు మెస్‌లు ఏర్పాటు చేయాలని వసతి గృహ వార్డెన్లకు సూచించారు. రాజోలులోని బాలుర, బాలికల వసతి గృహాలతోపాటు, శివకోడు గురుకుల బాలికల పాఠశాల ఆవరణలను పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రుల్లో గర్భిణులకు శస్త్ర చికిత్సలు చేస్తున్నారని, సాధారణ ప్రసవాలకు ప్రయత్నాలు జరగడం లేదన్నారు. ప్రతి 100 మంది గర్భిణుల్లో 80 మందికి కాన్పుల కోసం ఆపరేషన్లు చేస్తున్నారన్నారు. సాధారణ ప్రసవాలు చేసే విధంగా జిల్లా స్థాయిలో కమిటీ ఏర్పాటు చేసి ఆ కమిటీ ద్వారా ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరిగే ప్రసవాలపై దృష్టిసారిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రైవేటు ఆస్పత్రుల గైనకాలజిస్టులతో సమావేశం నిర్వహించి సాధారణ ప్రసవాలు చేసేలా ఆదేశాలు జారీ చేస్తామన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ఎప్పటికప్పుడు వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. డీఎంఓ ఎం.వెంకటేశ్వరరావు, తాటిపాక పీహెచ్‌సీ వైద్యాధికారులు ఫణికుమార్, మణికుమార్, సబ్ యూనిట్ ఆఫీసర్లు రాజశేఖర్, రాజబాబు, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉరుములు.. మెరుపులు



గంగలకుర్రులో కురుస్తున్న వర్షం

అంబాజీపేట: ఉరుములు, మెరుపులతో అంబాజీపేటలో గురువారం మధ్యాహ్నం సుమారు గంట పాటు వర్షం పడింది. పది రోజులుగా సూర్యుడి ప్రతాపాన్ని చూసి ప్రజలు హడలెత్తిపోతున్నారు. ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని మేఘాలు కమ్ముకున్నాయి. చిన్నా, పెద్దా అంతా హమ్మయ్యా అంటూ ఉపశమనం పొందారు. ఈ వర్షానికి పలు ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి. చిరు వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు.

ఆశలపై నీళ్లు.. రైతులకు కన్నీళ్లు

మామిడికుదురు: ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీవ్ర నిర్లక్ష్య వైఖరితో రైతుల పరిస్థితి అగమ్య గోచరంలా తయారైంది. గురువారం కురిసిన భారీ వర్షంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. కళ్లాల్లో ఉన్న ధాన్యం రాశుల చుట్టూ వర్షం నీరు చేరింది. మామిడికుదురు, నగరం, గెద్దాడ, మొగలికుదురు గ్రామాల్లో కళ్లాలు, జాతీయ రహదారులపై వేసిన ధాన్యం రాశుల చుట్టూ వర్షం నీరు చేరడంతో రైతులు తీవ్ర అవస్థలు పడ్డారు. గంట పాటు భారీ వర్షం కురిసింది. ధాన్యం రాశులు తడవకుండా బరకాలు వేసుకుని వాటిని కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడ్డారు. మండల పరిధిలో 2,768 ఎకరాల విస్తీర్ణంలో వరి పండించారు. ఎకరాకు 35 క్వింటాళ్ల వరకూ దిగుబడి వచ్చింది. దిగుబడి ఆశాజనకంగా ఉందని రైతులు ఆనందంగా ఉన్న వేళ ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోవడం రైతులకు శాపంగా మారింది. ఈ వారంలో కురిసిన అకాల వర్షాలకు పంట పాడైపోయిందని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బెల్లంపూడి వద్ద ధాన్యం రాశులపై కప్పిన బరకాలు

తడిసిన ధాన్యం

పి.గన్నవరం: మండలంలో గురువారం కురిసిన భారీ వర్షంతో రైతన్నలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కళ్లాల్లో ఎండబెట్టిన ధాన్యం పలుచోట్ల తడిసిపోవడంతో ఆందోళన చెందారు. ఇప్పటికే ధాన్యం కొనుగోలు చేసేందుకు తమను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు. అలాగే అకాల వర్షంతో తీవ్ర అవస్థలు పడ్డారు. పలుచోట్ల భారీ శబ్దాలతో పిడుగులు పడటంతో ప్రజలు భయాందోళన చెందారు. ఇటుక బట్టీల వద్ద ఆరబెట్టిన పచ్చి ఇటుకలు వర్షానికి తడిసి పాడయ్యాయి.

అపూర్వం.. సమ్మేళనం



జొన్నాడలో ఎస్‌డీఎస్ఎన్ఆర్ జెడ్పీ హైస్కూల్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఆలమూరు: ఆత్మీయత.. ఆప్యాయతతో కూడిన పలకరింపులతో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆకట్టుకుంది. 13 ఏళ్ల తరువాత కలుసుకున్న నాటి విద్యార్థులు సందడి చేశారు. జొన్నాడలోని శ్రీద్వారంపూడి సత్యనారాయణరెడ్డి జెడ్పీ హైస్కూల్‌లో గురువారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 2007–12 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు గత స్మృతులను నెమరవేసుకున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన వారంతా అలనాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులు, సిబ్బందిని ఘనంగా సత్కరించారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. సహచరులందరినీ వేదికపైకి తీసుకువచ్చిన కమిటీ సభ్యులైన కె.పూర్ణారెడ్డి, సురేందర్‌రెడ్డి, సూర్యచంద్ర, వీరబాబు, సుధీర్‌కుమార్‌లను పలువురు అభినందించారు.

బాధిత కుటుంబానికి చేయూత



బాధిత కుటుంబానికి సాయం చేస్తున్న పూర్వ విద్యార్థులు

మామిడికుదురు: రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2004 నుంచి 2007 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులంతా కలసి కొమరాడకు చెందిన దాసరి రమేష్ కుటుంబానికి గురువారం చేయూత అందించారు. నిరుపేద కుటుంబానికి చెందిన రమేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నేపథ్యంలో అతని కుటుంబానికి రూ.50 వేల సాయం చేశారు. మృతుడి తల్లి బేబీరత్నంకు ఈ సహాయాన్ని అందజేశారు. అప్పటి లెక్చరర్ రుద్రా శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు యేడిద నాగేశ్వరరావు, రుద్రా స్వామినాయుడు, జి.త్రిమూర్తులు పాల్గొన్నారు.

శ్రీరామ మందిరంలో పూజలు



ఈర్లచెరువులో వార్షికోత్సవ పూజలు చేస్తున్న పండితులు

మామిడికుదురు: స్థానిక శివారు ఈర్లచెరువు శ్రీరామ మందిరం 12వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీసీతారామచంద్ర, శ్రీవరసిద్ధి వినాయక, షిర్డీ సాయిబాబా, కనకదుర్గాంబిక, నూకాలమ్మ వార్ల విగ్రహాల వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలను జరిపించారు. ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీరామ నామ సంకీర్తనలు, బాణసంచా కాల్పులతో స్వామివారి గ్రామోత్సవం జరిగింది. కార్యక్రమంలో కుడుపూడి వెంకటశ్రీరామశెట్టి, పద్మావతి, ఏకాంబరేశ్వరరావు, నాగచంద్రావతి దంపతులు ప్రధాన కర్తలుగా పాల్గొన్నారు. దత్తాత్రేయ కన్‌స్ట్రక్షన్స్ తరఫున పట్నాల దత్తాత్రేయ పూజా సామగ్రి అందించారు. యువ భట్టాచార్య పెద్దింటి సాయి రామకృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

వైభవంగా కుంకుమ పూజలు

పి.గన్నవరం: వాడ్రేవుపల్లి గ్రామంలో మాణిక్యాలమ్మ వారి జాతర మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి 108 కలశలతో నదీ జలాలను తీసుకువచ్చి మహిళలు అభిషేకం చేశారు. అనంతరం విశేష కుంకుమార్చనలు నిర్వహించారు. రాత్రి జాతర మహోత్సవం జరిగింది.

ఘనంగా తీర్థ మహోత్సవాలు

మలికిపురం: మండలంలోని మేడిచర్లపాలెంలో కనకదుర్గమ్మ, మారెమ్మ, నూకాలమ్మ అమ్మవార్ల తీర్థాలు గురువారం ఘనంగా జరిగాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు.

రక్షణ కరవైనది



గోదావరి నదీ గర్భంలోకి దిగబడిన గ్రోయిన్

- పల్లిపాలెం గ్రామానికి భద్రత కరవు
- గ్రోయిన్ల ఎత్తు పెంచాలని వినతి

సఖినేటిపల్లి: రక్షణ కరవైంది.. వశిష్టా గోదావరి నదీ ఆటుపోట్లతో పల్లిపాలెం గ్రామానికి నష్టం వాటిల్లుతోంది. సాగర సంగమానికి సమీపంలో వశిష్ట గోదావరి తీరాన్ని ఆనుకుని ఈ గ్రామం ఉండడంతో సముద్ర కెరటాలు దాటికి, గోదావరి ఆటుపోట్ల ప్రభావానికి గురవుతోంది. పౌర్ణమి, అమావాస్యలకు ఉండే ఆటుపోట్లతో పాటు, ప్రకృతి వైపరీత్యాలకు కెరటాలు రివెట్‌మెంట్‌ను దాటుకుని మరీ గ్రామంలోకి చొచ్చుకు వస్తున్నాయి. పల్లిపాలెం తీరంలో పుష్కర కాలానికి ముందు నిర్మించిన గ్రోయిన్లు, వాటి మధ్య రివిట్‌మెంట్ పూర్తిగా కుంగిపోయాయి. దీనివల్ల గ్రామానికి ముప్పుగా పరిణమించింది. నాటి పరిస్థితులకు తగ్గట్టుగా నిర్మించిన గ్రోయిన్లు ప్రస్తుతం నదీ గర్భంలోకి కుంగిపోతున్నాయి. నానాటికి దిగబడిపోతున్న గ్రోయిన్లు, చెల్లాచెదురవుతున్న రివిట్‌మెంట్ గ్రామ రక్షణకు సహకరించడం లేదని ప్రజలు వాపోతున్నారు.

తీర గ్రామాలకు ముప్పు

పల్లిపాలెం గ్రామంతో పాటు అంతర్వేది దేవస్థానం, గొంది, గుడిమూల, రామేశ్వరం, సఖినేటిపల్లిలంక, సఖినేటిపల్లి, అప్పనరామునిలంక గ్రామాల్లో గోదావరి నదీ తీరం వెంబడి ముప్పు వాటిల్లుతోంది. ప్రధానంగా పల్లిపాలెంలో ప్రకృతి వైపరీత్యాలకు తోడు ఏటా జూలై, ఆగస్టు నెలల మధ్యలో వచ్చే వరదల ఉధృతికి కూడా రివిట్‌మెంట్ రాళ్లు గోదావరి నదిలోకి జారిపోతున్నాయని స్థానికులు అంటున్నారు. సముద్రానికి అతి సమీపంలోని గ్రామ రక్షణకు 2001లో అప్పటి రాజోలు ఎమ్మెల్యే ఏవీ సూర్యనారాయణ రాజు గోదావరి నదీకోత నివారణకు నాలుగు గ్రోయిన్లు, వాటి మధ్య రివిట్‌మెంటు నిర్మాణ పనులు పూర్తి చేయించారు. 2008లో అప్పటి రాజోలు ఎమ్మెల్యే అల్లూరు కృష్ణంరాజు సారధ్యంలో మరో నాలుగు గ్రోయిన్లు నిర్మించారు. పల్లిపాలెం చేపలరేవు వద్ద నుంచి గ్రామ శివారు 10వ వార్డు వరకూ సుమారు కిలోమీటరు పొడవు ఉన్న తీరంలోని 8 గ్రోయిన్ల ఎత్తు పెంచి, వాటి మధ్య చెల్లాచెదురవుతున్న రివిట్‌మెంట్‌ను పటిష్ఠపరచాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

నియోజకవర్గంలో నదీకోత నుంచి గ్రామాల రక్షణకు ప్రతిపాదనలు పంపించాం. ఇందుకు సుమారు రూ.200 కోట్ల మేర అంచనాలు రూపొందించాం. వీటిల్లో సఖినేటిపల్లి బోను వద్ద నుంచి సఖినేటిపల్లి రేవు వరకూ మూడు కిలోమీటర్ల మేర, అంతర్వేది, పల్లిపాలెం లిమిట్స్‌లో మరో మూడు కిలోమీటర్ల మేర గ్రోయిన్లు, రివిట్‌మెంట్‌కు ప్రతిపాదించాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉంది.

–టీవీఎల్ఎన్ మూర్తి, హెడ్‌వర్క్స్ ఏఈ, రాజోలు



పల్లిపాలెం గోదావరి తీరం వెంబడి బలహీనపడిన రివిట్‌మెంట్

కాటన్ సేవలు చిరస్మరణీయం



అంబాజీపేటలో కాటన్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు



కొత్తపేటలో కాటన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బాపిరాజు తదితరులు

అంబాజీపేట: సర్ ఆర్థర్ కాటన్ సేవలు చిరస్మరణీయమని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయం వద్ద కాటన్ మహాశయుని జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీటీసీల మండల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, గణపతి వీరరాఘవులు, బొంతు పెదబాబు, సూదాబత్తుల రాము, రవణం రాము, ముత్యాల జమ్మీలు పాల్గొన్నారు.

అయినవిల్లి: నల్లచెరువు గ్రామంలో కాటన్ జయంతిని రైతు నాయకులు ఘనంగా జరిపారు. సర్పంచ్ గుండుమోగుల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ రావూరి వెంకటరామారావులు కాటన్ విగ్రహానికి పూలమాలలు వేశారు. రైతు ఉద్యమ నాయకుడు గణేశుల రాంబాబు, నాయకులు రావూరి వెంకటరత్నం, గుండుమోగుల తాతాజీ, రావూరి ప్రభాకరరావు, గుర్రం నారాయణస్వామి పాల్గొన్నారు.

కొత్తపేట: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసిన కాటన్ మహాశయుడిని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ రైతు విభాగం అధ్యక్షుడు పెదపూడి బాపిరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం రోడ్డు ముఖ ద్వారంలో కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు చిక్కం శివాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఆదుర్రులో కాటన్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు

ఆలమూరు: చొప్పెల్ల లాకుల వద్ద, ఆలమూరు ఇరిగేషన్ కార్యాలయం వద్ద కాటన్ విగ్రహాలకు ఆ శాఖాధికారులు, సిబ్బంది పూలమాలలు వేశారు. జొన్నాడ, చింతలూరు, పెనికేరు, మడికి గ్రామాల్లో కాటన్ విగ్రహాలకు రైతులు ఘన నివాళులు అర్పించారు.

మామిడికుదురు: సర్ ఆర్థర్ కాటన్ సేవలు చిరస్మరణీయమని ఆదుర్రు సర్పంచ్ బళ్ల శ్రీనివాసరావు అన్నారు. ఆదుర్రులో కాటన్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పెదసింగు నరసింహస్వామి, కుడుపూడి సురేష్, పినిశెట్టి నాగబాబు, కోటిపల్లి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: స్థానిక లాకుల వద్ద సర్ ఆర్థర్ కాటన్ జయంతి వేడుకలు సఖినేటిపల్లి నీటి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కాటన్ విగ్రహానికి సంఘ అధ్యక్షుడు నామన నాగభూషణం, ఉపాధ్యక్షుడు కందుల సూర్యచంద్రరావు, మాజీ సంఘ అధ్యక్షుడు రుద్రరాజు ఆంజనేయరాజు, మాజీ సర్పంచ్ రావి ధర్మరాజు, లాకు సూపరింటెండెంట్ జాన్సన్‌లు పూలమాలలు వేశారు.

సఖినేటిపల్లి: మోరిలో రాజోలు తాలూకా సమష్టి వ్యవసాయ సహకార సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో కాటన్ జయంతి నిర్వహించారు. సమాఖ్య గౌరవ అధ్యక్షుడు ఓగూరి టాండన్‌రాజు, అధ్యక్షుడు గెద్దం ప్రభాకర్‌రావు, రైతు సంఘ నాయకులు చింతా శేషు, రాపాక నానాజీ, తాడి ఆనందరావు పాల్గొన్నారు.

పి.గన్నవరం: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద కాటన్ జయంతిని నిర్వహించారు. తహసీల్దార్ శ్రీపల్లవి, డీటీ ఎం.సత్యనారాయణ, ఆర్ఐ యన్నపు డాంగే, వీఆర్వో పి.నరసింహారావు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాయం వద్ద కాటన్ విగ్రహానికి ఎంపీడీఓ కేవీ ప్రసాద్, కార్యదర్శి నిమ్మకాయల వీవీ సత్యనారాయణ తదితరులు పూలమాలలు వేశారు.